క్లుప్తంగా

అసత్య ఆరోపణలు తగదు



భూపాలపల్లి అర్బన్: బీజేపీ నాయకురాలు చందుపట్ల కీర్తిరెడ్డి కమ్యూనిస్టుల చరిత్ర తెలుసుకొని ఆరోపణలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ సూచించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజ్‌కుమార్ మాట్లాడుతూ..బీజేపీ నాయకురాలు కీర్తిరెడ్డి కమ్యూనిస్టులపై చేసిన అసత్య ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. పేదలకు డబుల్ బెడ్ రూంలు ఇవ్వడం లేదని పేదల పక్షాన పోరాటం చేసి సుమా రు మూడు వేల గుడిసెలు వేసుకుని ఉంటే సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో వారికి అండగా నిలవడం జరుగుతుందన్నారు. పేదల పక్షాన నిలిచేది కమ్యూనిస్టులేదనన్నారు. అనేక భూపోరాటాలు నిర్వహించిన సంగతి తెలుసుకొని మాట్లాడాలన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముకుంటూ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సోత్కు ప్రవీణ్, క్యాతరాజ్ సతీష్, కొరిమి సుగుణ, కుడుదుల వెంకటేష్, జోసఫ్, శ్రీకాంత్, మౌనిక, వనిత, లావణ్య, గుడిసెవాసులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



మల్హర్: మండలంలోని వల్లెకుంట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త పుల్లూరి లింగరావు ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. కాగా ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా మంజూరైన రూ.2లక్షల బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ ప్రమాద బీమా చెక్కును ఆ పార్టీ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి బాధిత సభ్యులకు సోమవారం అందజేశారు. మండల నాయకులు వాల యాదగిరిరావు, తాజొద్దీ న్, మండల కోఆప్షన్ సభ్యుడు అయూబ్‌ఖాన్, భాద్రపు సమ్మయ్య, శ్రీశైలం, లచ్చయ్య, రమేష్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అధ్యక్షుడిగా రమేశ్



చిట్యాల: ట్రస్మా నియోజకవర్గ అధ్యక్షుడిగా మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన ఆకుల రమేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు దేవేందర్‌రెడ్డి, రాజ్‌మహ్మద్‌లు తెలిపారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ట్రస్మా కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా సతీష్, కోశాధికారిగా జోసేఫ్, ఉపాధ్యక్షుడిగా శివశంకర్, సంయుక్త కార్యదర్శిగా ఎండీ ఫారోజ్‌ను ఏకగ్రీవంగా నియమించారు.

భూమిని లాక్కోవడం సరికాదు

కాటారం: మండల కేంద్రంలోని మహదేవపూర్ వైపు ఓ ప్రైవేటు భూమిని ఆర్టీసీ అధికారులు బస్టాండ్ పేరిట లాక్కోవడానికి ప్రయత్నించడం సరికాదని చిద్నెపల్లి మాజీ ఎంపీటీసీ నరసింహారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూర్వపు మహదేవపూర్ జమీందార్ ఊర కమల మనోహర్‌రావు 1945లో అతడికి ఉన్న భూమిని పేదలకు విరాళంగా అందజేశారని పేర్కొన్నారు. అందులో భాగంగా మండల కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణం కోసం మూడు ఎకరాల భూమిని విరాళంగా అందజేయడం జరిగిందని తెలిపారు. ఆస్పత్రిలోని కొంత భూమిని ఆర్టీసీ బస్సులు నిలుపుకునేందుకు వినియోగించుకోవాలని గతంలో సూచించినట్లు వివరించారు. కానీ అట్టి భూమిని ఆర్టీసీ అధికారులు వినియోగించుకోలేదని ఆరోపించారు. ఇప్పుడు 35 సర్వే నంబర్‌లో గల భూమి ఆర్టీసీకి చెందుతుందని అధికారులు దౌర్జన్యానికి పాల్పడుతున్నారని అన్నారు. ఈ సర్వే నంబర్‌లో వంశపారపర్యంగా వచ్చిన 17 ఎకరాల భూమిపై ఊర నందకిషోర్, డాక్టర్ ఊర నందగోపాల్‌కు పూర్తి హక్కు ఉందని రెవెన్యూ రికార్డుల్లో సైతం వారి పేర్లే నమోదై ఉన్నట్లు పేర్కొన్నారు. ఊర రంగమ్మ ఆర్టీసీకి ఎకరం భూమి విరాళంగా ఇచ్చారనేది అవాస్తవం అన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఆర్టీసీ అధికారులు కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారని న్యాయపరంగా తాము ముందుకెళ్తున్నట్లు వివరించారు.

పొలంలో కుళ్లిన మృతదేహం

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం ముచ్చర్ల శివారులోని ఓ వ్యవసాయ పొలంలో కుళ్లిన మృతదేహం లభ్యమైంది. తన పొలంలో మృతదేహం ఉందని ముచ్చర్లకు చెందిన ఓరుగంటి గణపతిరెడ్డి అనే రైతు పోలీసులకు సమాచారం అందించాడు. ఈమేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడు భూపాలపల్లి జిల్లా మల్హర్‌రావు మండలం వల్లంకుంట గ్రామానికి చెందిన శేఖర్‌గా ధ్రువీకరించారు. శేఖర్ మతిస్థిమితం కోల్పోయి ముచ్చర్లకు చేరినట్లు పోలీసులు తెలిపారు.

ప్రస్తుతం చాలా గ్రామాల్లో ఆర్‌ఓ వాటర్ వినియోగిస్తున్నారు. బావులు, బోర్ల నీళ్లు కూడా పల్లెల్లో తాగునీటిగా వాడడం లేదు. కానీ పలిమెల మండలంలోని ముకునూరు గ్రామంలోని ప్రజలు ఇప్పటికీ గుట్టపై నుంచి వస్తున్న నీటిని తప్ప వేరే తాగడం లేదు. కిలో మీటర్ దూరం నుంచి మోసుకొచ్చుకుని ఇష్టంగా తాగుతున్నారు. గుట్టల్లోంచి వచ్చే నీటిలో ఆయుర్వేద గుణాలున్నాయని, ఈ నీరు ఆరోగ్యానికి మేలు చేస్తుందని గ్రామస్తులు చెబుతున్నారు.

\- పలిమెల



బుగ్గ వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళ

బుగ్గ నీరు.. బగ్గ రుచి!

గుట్ట నుంచి ఉబికి వస్తున్న నీరు

- ఏళ్లుగా తాగుతున్న గ్రామస్తులు
- కిలో మీటర్ దూరం నడిచైనా సరే.. ఈనీటికే ప్రియారిటీ
- నీళ్లలో ఆయుర్వేద గుణాలున్నాయని నమ్మకం



పలిమెల మండలంలోని ముకునూరులో గ్రామానికి సమీపంగా ఉన్న గుట్ట వద్ద నుంచి నీరు సహజసిద్ధంగా ఉబికి వస్తోంది. ఈ నీరునే కొన్ని తరాలుగా గ్రామంలోని సగం మంది ప్రజలకు పైగా ఇష్టంగా తాగుతున్నారు. ప్రభుత్వం గ్రామస్తులకు మంచినీటిని అందిస్తున్నప్పటికీ, మిషన్ భగీరథ, బోరు నీరు ఉన్నప్పటికీ ఈ గుట్ట వద్ద నుంచి ఉబికి వచ్చే నీటినే వారు ఇష్టపడుతున్నారు. గ్రామానికి ఈ గుట్ట సుమారు కిలో మీటరుకు పైగా దూరం ఉన్నప్పటికీ గ్రామస్తులు నడుచుకుంటూ, యువకులు బండ్లపై వెళ్లి నీటిని తీసుకువస్తుంటారు. సహజసిద్ధంగా ఉబికి వచ్చే ఈ నీటిలో ఎన్నో ఆయుర్వేద గుణాలు ఉన్నాయని గ్రామస్తుల నమ్మకం, ఈ నీటిని సేవించడం ద్వారా ఎలాంటి రోగాల రాకుండా ఆరోగ్యంగా ఉంటామని వారి విశ్వాసం. ముకునూరు గ్రామస్తులే కాక సమీపంలోని ఇతర గ్రామాల ప్రజల కూడా ఇక్కడి నుంచి నీటిని తీసుకువెళ్తుంటారు. సంవత్సరం మొత్తం కూడా ఈ బుగ్గలోని నీరు కొంత మేర కూడా తగ్గినట్టు కనిపించకపోవడం విశేషం.

నిత్యం నీరు పారుతోంది



వర్షాకాలం, ఎండాకాలం అనే తేడా లేకుండా సంవత్సరం పొడువునా ఇక్కడ నీరు ఉబికి వస్తూనే ఉంటుంది. ఏ కాలంలోనైనా ఇక్కడ నీరు ఎంతో స్వచ్ఛంగా ఉంటాయి. అందుకే మా గ్రామంలోని సగం మంది ప్రజల బుగ్గ నీటిని తాగేందుకు ఇష్టపడుతారు. ప్రభుత్వం అందిస్తున్న మిషన్ భగీరథ నీరు, ప్రైవేట్ మినరల్ వాటర్ కంటే కూడా ఈ బుగ్గ నీరు ఎంతో రుచిగా ఉంటాయి.

\- చిన్నక్క, బండారిగూడెం

కావడితో బుగ్గ నీటిని తీసుకెళ్తున్న గ్రామస్తుడు



బుగ్గ నీటినే తాగుతాం..

మిషన్ భగీరథ, బోరు నీరు ఉన్నప్పటికీ వాటిని నిత్యావసరాలకు వాడుకోని ఈ బుగ్గ నీటినే తాగేందుకు ఉపయోగిస్తాం. ప్రతి రోజు ఉదయం లేదా సాయంత్రం కావడితో రెండు బిందెల నీటిని తీసుకువస్తే ఒక రోజు సరిపోతాయి. ఈ నీరు తప్ప మరే నీటిని తాగిన తాగినట్టు అనిపించదన్నారు.

\- మట్టి పాపారావు, బండారిగూడెం

అధికారులు అందుబాటులో ఉండాలి

ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

టేకుమట్ల(రేగొండ): మండల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పున్నం లక్ష్మీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధి పాటుపడాలన్నారు. వచ్చే వేసవి కాలంలో ప్రజలకు ఏలాంటి నీటి సమస్య లేకుండా సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం మండలంలోని గోరికొత్తపల్లి గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

బీఆర్ఎస్‌లో చేరిన సర్పంచ్

మండలంలోని రంగయ్యపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ దగ్గు సంధ్యవెంకటేశ్వర్‌రావుతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీని వీడి ఎమ్మెల్యే గండ్ర, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి సమక్షంలో బీఆర్ఎస్ చేరారు. దీంతో వారికి కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు బంధు కో ఆర్డినేటర్ హింగే మహేందర్, జెడ్పీటీసీ సాయిని విజయ, పీఏసీఎస్ చైర్మన్ విజ్ఞన్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు అంకం రాజేందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దీక్ష



జీఎం కార్యాలయం ఎదుట దీక్ష చేస్తున్న నాయకులు

అధికారుల హామీతో విరమణ

భూపాలపల్లి అర్బన్: ఏరియాలోని కేటీకే ఓపెన్ కాస్టు 3 ప్రాజెక్ట్‌లో సస్పెన్షన్ చేసిన మైనింగ్ స్టాప్ సాదుల ప్రకాశ్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ భూపాలపల్లి ఏరియా మైనింగ్ సిబ్బంది అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం రిలే నిరహార దీక్షలను ప్రారంభించారు. ఏరియా జీఎం కార్యాలయం ఎదుట దీక్ష చేపడుతుండటగా సింగరేణి డైరెక్టర్లు బలరాం, శ్రీనివాస్‌లు దీక్ష శిబిరాన్ని సందర్శించి జీఎం కార్యాలయంలో కార్మిక సంఘాల నాయకులతో మాట్లాడారు. సస్పెన్షన్ ఎత్తివేసి విధుల్లో తీసుకుంటామని హామీ ఇవ్వడంతో కార్మికులు దీక్షను విరమించారు. ఈ దీక్షలకు టీబీజీకేఎస్, ఏఐటీయూసీ, బీఎంఎస్, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూసీ, హెచ్ఎంఎస్, సింగరేణి ఉద్యోగుల సంఘం నాయకులు మద్దతు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన



గని మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: సింగరేణిలో పని చేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఎంఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి గని అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కేటీకే 1వ గనిలో ఏర్పాటు చేసిన సమావేశంలో బ్రాంచి ఉపాధ్యక్షుడు అప్పాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. 11వ వేజ్ బోర్డు జేబీసీసీఐ సమావేశాన్ని వెంటనే నిర్వహించాలని, దేశ వ్యాప్తంగా బీఎంఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఏరియాలో బ్యారెక్‌లో నివసిస్తున్న కార్మికులకు హెచ్ఆర్ఏ ఇవ్వాలని, నూతన క్వార్టర్స్ కేటాయింపులో రాజకీయ జోక్యం లేకుండా కార్మికులకు మాత్రమే కేటాయించాలని డిమాండ్ చేశారు. భాస్కర్, సుజేందర్, మల్లారెడ్డి, రఘుపతిరెడ్డి, సాంబయ్య, బత్తుల స్వామి, మల్లేష్, రాజిరెడ్డి రమేష్, మల్లేష్, శ్రీనివాస్, శంకర్, నారాయణ ఉన్నారు.

ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో..

భూపాలపల్లి ఏరియాలో సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఐఎన్టీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు జోగు బుచ్చయ్య డిమాండ్ చేశారు. సోమవారం బ్రాంచి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బుచ్చయ్య మాట్లాడుతూ.. భూపాలపల్లి ఏరియాలో సింగరేణి కార్మికులు అనేక సమస్యలతో నలిగిపోతున్నారన్నారు. ఈ నెల 23న మంత్రి కేటీఆర్ జిల్లా పర్యటనకు వస్తున్న సందర్భంగా కార్మికులకు ఇచ్చిన హామీలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. సింగరేణి కార్మికులు 250 గజాల సొంత ఇంటి స్థలం కేటాయించాలని, వడ్డీ లేని రూ.20 లక్షల రుణాలు ఇవ్వాలన్నారు. 8వ గనిలో పని చేస్తున్న కార్మికులకు హెచ్ఆర్ఏ అమలు చేయాలని, గనుల్లో ప్రైవేట్ విభాగాలతో నడుస్తున్న కాంట్రాక్టులను రద్దు చేసి పూర్తిస్థాయిలో సింగరేణికే కేటాయించాలన్నారు. రాజేందర్, రఘుపతిరెడ్డి, అశోక్, మధుకర్‌రెడ్డి, వేణుగోపాల్, జనార్దన్, శ్రీనివాస్, కృష్ణ, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

యాత్రను విజయవంతం చేయండి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న గండ్ర సత్యనారాయణరావు

చిట్యాల: మండలంలోని చల్లగరిగ నుంచి ఈ నెల 22న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నిర్వహించే హాథ్ సే హాథ్ జోడో యాత్రను కార్యకర్తలు విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు పిలుపునిచ్చారు. చల్లగరిగ గ్రామంలో రేవంత్‌రెడ్డి బస ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. మంగళవారం రాత్రి చల్లగరిగ గ్రామంలో బస చేస్తారని తెలిపారు. బుధవారం ఉదయం 9గంటల నుంచి యాత్ర ప్రారంభం అవుతుందన్నారు. చల్లగరిగ, జూకల్, తిర్మలాపూర్, చిట్యాల, నవాబుపేట, మీదుగా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో కార్నర్ సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యకర్తలు, నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు గూట్ల తిరుపతి, గడ్డం కొమురయ్య, మధువంశీ కృష్ణ, మూల శంకర్ గౌడ్, కర్రె పులేందర్ రెడ్డి, సర్వ శరత్ కుమార్, ఎంపీటీసీ దబ్బెట అనిల్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న పుట్ట మధు

పలిమెల: బీఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ సమక్షంలో మండలంలోని దమ్మూరు, ముకునూర్ గ్రామ పంచాయతీలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పుట్ట మధుకర్ మంథనిలోని అతడి నివాసంలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జవ్వాజీ తిరుపతి, ముకునూర్ సర్పంచ్ ఆలం సత్యం, యువనాయకులు జక్కు రాకేష్, మాడే సత్యనారాయణ, కృష్ణస్వామి, ఉప సర్పంచ్ పొడెం సుధాకర్, వార్డు సభ్యులు మట్టి బిష్మరావు, తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి ఆర్థికసాయం



చెక్కు అందజేస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: మండలంలోని నాగారం గ్రామానికి చెందిన తాటి వెంకట్‌గౌడ్ ఇటీవల ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి పడి గాయాలపాలయ్యాడు. దీంతో బాధితుడికి వైద్యఖర్చుల నిమిత్తం తాడి కార్పొరేషన్ నుంచి వచ్చిన రూ.15000లను సర్వాయి పాపన్న గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి ప్రభాకర్ ఆధ్వర్యంలో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి ఆర్థిక సాయం అందించడానికి కృషి చేసిన బీసీ సంక్షేమశాఖ ప్రిన్సిపాల్ కార్యదర్శి, తాడి కార్పొరేషన్ చైర్మన్ వెంకటేశంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు ఏరుకొండ సంపత్, నాయకులు శ్రీపతి గోపి, నాగారం గ్రామ సొసైటీ అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ను సద్వినియోగం చేసుకోవాలి

మొగుళ్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ జోరుక సదయ్య అన్నారు. సోమవారం మండలంలోని గుడిపహడ్ గ్రామంలో ప్రాథమిక వైద్యాధికారిని నాగరాణి, నవిత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమానికి సర్పంచ్ పాశం స్వరూపతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని తీసుకువచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యార సుజాతసంజీవరెడ్డి, ఎంపీడీఓ కృష్ణవేణి, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



మొగుళ్లపల్లి: కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

కాటారం: మండలంలోని ఒడిపిలవంచలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ కోడి రవికుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకొని అవసరమైన మందులు, కంటి అద్దాలు తీసుకోవాలని సూచించారు. కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మౌనిక, లింగమూర్తి, పంచాయతీ కార్యదర్శి అపర్ణ, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ‘కంటి వెలుగు’

మహదేవపూర్: మండలంలో చేపట్టిన కంటివెలుగు కార్యక్రమం కొనసాగుతోంది. మహదేవపురం గ్రామ పంచాయతీ పరిధిలో సోమవారం వరకు 3600 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని వైద్యులు తెలిపారు. మార్చి 12వ తేదీ వరకు ఈ శిబిరం నిర్వహిస్తామని ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ శ్రీపతి బాబు తెలిపారు.



కాటారం: శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ రవికుమార్

ఎమ్మెల్సీ కవితకు పట్టువస్త్రాల అందజేత



పట్టువస్త్రాలు అందజేస్తున్న నారాయణరెడ్డి

కాటారం: శ్రీ మహామృత్యుంజయ జప సహిత యాగంకు సంబంధించిన పట్టు వస్త్రాలు, ప్రసాదం, విభూదిని కాటారం పీఏసీఎస్ చైర్మన్ చల్ల నారాయణరెడ్డి సోమవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవితకు అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ దేశంలో అత్యధిక ఎంపీ సీట్లు గెలిచి అధికారంలోకి రావాలని ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి సన్నిధి, త్రివేణి సంఘమ తీరాన ఇటీవల చల్ల నారాయణరెడ్డి శ్రీ మహామృత్యుంజయ జప సహిత యాగం నిర్వహించారు. యాగానికి సంబంధించి వాటిని ఎమ్మెల్సీకి అందజేశారు. రాష్ట్ర పశుసంవర్థక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి మండలంలో పశువైద్యానికి సంబంధించిన సమస్యలు తీర్చాలని వినతిపత్రం అందజేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



చిట్యాల: పరామర్శిస్తున్న నాయకులు

చిట్యాల: మండలంలోని వెంకట్రావ్‌పల్లి (సీ) గ్రామానికి చెందిన పుల్ల నరేష్ ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబానికి అంబేద్కర్ అభివృద్ధి కమిటీ నాయకులు సోమవారం పరామర్శించి రూ.2500లతో పాటు 50 కేజీల బియ్యం అందజేశారు. నాయకుడు సతీషకుమార్, అంబేద్కర్ యువజన సంఘం రాష్ట నాయకులు పుల్ల మల్లయ్య, యూత్ మాజీ అధ్యక్షుడు పుల్యాల సురేష్, వార్డ్ మెంబర్ పుల్ల రజిత అశోక్, కమిటీ సభ్యులు మాస్ రమేష్, మాస్ రాములు, మాస్ పవన్, పుల్ల సుమన్, పుల్ల గణేష్, చెరుకు సందీప్, పుల్ల సతీష్, మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఏవైఎస్ నాయకుల ఆధ్వర్యంలో..

మండలంలోని నవాబ్‌పేట గ్రామానికి చెందిన చిలుముల ప్రభాకర్ ప్రమాదవశాత్తు కాలు విరిగిపోయింది. దీంతో బాధిత కుటుంబాన్ని అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు బొడ్డు ప్రభాకర్ పరామర్శించారు. అనంతరం మండల కేంద్రంలోని వెంకట్రావుపలి(సి) గ్రామానికి చెందిన కనకం తిరుపతి అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందగా సంఘం నాయకులు అతడిని పరామర్శించి ధైర్యం చెప్పారు. అదే కాలనీలోకి చెందిన పుల్ల నరేష్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. సరిగొమ్ముల రాజేందర్, గుర్రం రాజమౌళి, గురుకుంట్ల కిరణ్, గుర్రం తిరుపతి, కట్కూరి రమేశ్, గడ్డం సదానందం, రవీందర్, దాసారపు నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ములుగు రూరల్: మండలంలోని రాంచంద్రాపురం గ్రామానికి చెందిన కీసర రాజు ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ సోమవారం పరామర్శించి రూ.2 వేల ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట నాయకులు బైకాని ఓదెలు, రూప్‌సింగ్, విజయ్‌పాల్‌రెడ్డి ఉన్నారు.

ఎస్ఎస్ తాడ్వాయి: మండలంలోని కాటాపూర్ గ్రామానికి చెందిన తిరువాయిముడి రవి ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు బాదం ప్రవీణ్‌కుమార్ సోమవారం పరామర్శించి, రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

మహాముత్తారం: మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని సర్పంచ్ విమల, సింగిల్‌విండో చైర్మన్ సోమ శాంతకుమార్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కనుకునూర్ నుంచి కేవలం 12 కిలోమీటర్ల దూరం ఉంటుందని అక్కడి వరకు బస్సు సౌకర్యం ఏర్పటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కనుకునూర్ సర్పంచ్ కుడుముల లక్ష్మి, జగపతినాయక్ తదితరులు ఉన్నారు.